క్లుప్తంగా

ఇంటర్ పరీక్షలకు 87 మంది గైర్హాజరు

కొవ్వూరు: డివిజన్‌లో గురువారం ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం లెక్కలు, హిస్టరీ, జువాలజీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. డివిజన్‌లోని 15 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 4,292 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 87 మంది గైర్హాజరయ్యారు. 4,205 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. జనరల్ కేటగిరిలో మొత్తం 3,599 మందికి 50 మంది గైర్హాజరు కాగా, మిగిలిన 3,549 మంది పరీక్షలు రాశారు.ఇక ఒకేషనల్ విభాగంలో 693 మందికి 37 మంది గైర్హాజరయ్యారు. దీంతో 656 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. కొవ్వూరు పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 670 మంది పరీక్షలు రాశారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 260 మందికి గాను ఐదుగురు, చైతన్య కళాశాల పరీక్ష కేంద్రానికి 213 మందిలో ఇద్దరు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 208 మందిలో నలుగురు గైర్హాజరయ్యారు. మొత్తం మూడు పరీక్షా కేంద్రాల్లో 681 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా వీరిలో 11 మంది విద్యార్థులు హాజరుకాలేదు.

ఆవపాడులో విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం


పూజల్లో పాల్గొన్న దంపతులు

నల్లజర్ల: మండలంలోని ఆవపాడు గ్రామంలో పునర్నిర్మించిన రామాలయంలో గణపతి, సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుడు అయిలూరి వేణుగోపాలశర్మ (వేణు)ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, ధాన్యాదివాసం, క్షీరాదివాసం, కళాహోమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం జరిగింది. ఆవపాడు గ్రామ ఆడపడుచులను ఈ వేడుకకు ఆహ్వానించి నూతన వస్త్రాలు అందించారు. ఊరంతా పండగ వాతావరణం నెలకొంది.

రోడ్డు పనులకు భూమిపూజ


కొవ్వూరులో భూమి పూజ చేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు: పదిహేనో ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి శుక్రవారం భూమిపూజ చేసి, పనులను ప్రారంభించారు. మంత్రి తానేటి వనిత క్యాంపు కార్యాలయం ఎదురుగా గల 102 మీటర్ల రోడ్డును, మెహర్ బాబా గుడి సమీపంలో 218 మీటర్లు పొడవైన రోడ్డును రూ.18 లక్షల వ్యయంతో తారు రోడ్డుగా అభివృద్ధి చేసున్నట్టు చైర్‌పర్సన్ తెలిపారు. మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, ఏఈ దుర్గా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

హత్యకు నిరసనగా శాంతియుత ప్రదర్శన

తాళ్లపూడి: కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవృక్షంలో జరిగిన నడిపల్లి రాము అనే దళితుడి హత్యను నిరసిస్తూ తాళ్లపూడి మండలంలోని అన్నదేవరపేటలో దళిత సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు పిట్టా శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా బాధ్యులైన కుల దురహంకారులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో పోలుమాటి విజయ్, ఎలిపే ప్రకాష్, ప్రభాకరరాజు, మరపట్ల శ్రీను, జి. అంజి, చిన్ని, భార్గవ్, సాధనాల రమేష్, జైభీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరవలి: ఐసీడీఎస్ పెరవలి సెక్టార్ పరిధిలో ఖాళీగా ఉన్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త, ఆరుగురు సహాయకుల పోస్టుల భర్తీకి అర్హులైన, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ శ్రీలక్ష్మి శుక్రవారం తెలిపారు. కానూరులో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఉండ్రాజవరం మండలంలోని ఉండ్రాజవరం, మోర్త, సూర్యారావుపాలెం, వేలివెన్ను, ఉండ్రాజవరం, కాల్దారి అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

నల్లజర్ల మండలంలో..

నల్లజర్ల: గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నల్లజర్ల మండలంలో ఖాళీగా ఉన్న ఏడు అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ సీడీపీఓ వెంకటలక్ష్మి తెలిపారు.అనంతపల్లి-5 (ఓపెన్ కేటగిరీ), అయ్యవరం-1 (బీసీ-ఏ), పోతవరం-9 (ఓపెన్ కేటగిరీ), తెలికిచెర్ల-5 (బీసీ-బి), ఆవపాడు-1 ఓపెన్ కేటరిరీ, అనంతపల్లి-6 (ఎస్టీ) అనంతపల్లి-3 (ఎస్సీ)లకు కేటాయించినట్టు వివరిచారు. స్థానికులైన వివాహిత మహిళలే అర్హులన్నారు. 21-35 సంవత్సరాల మధ్య వయస్కులు, కనీసం10వ తరగతి పాసై ఉండాలన్నారు.

మెగా కొవ్వూరు !


కొవ్వూరు మునిసిపాలిటీ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు ప్రతిపాదించిన మ్యాప్


కొవ్వూరు పురపాలక సంఘం ప్రస్తుత మ్యాప్


కొవ్వూరు పురపాలక సంఘం కార్యాలయం

- పట్టణ విస్తరణకు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ విడుదల
- 8 పంచాయతీల విలీనానికి ప్రతిపాదన
- కార్యరూపం దాలిస్తే గ్రేడ్-2 మునిసిపాలిటీగా కొవ్వూరు
- అభ్యంతరాల స్వీకరణకు ఏప్రిల్ 21 వరకూ గడువు

కొవ్వూరు: పెరుగుతున్న జనాభా, ప్రజావసరాలకు అనుగుణంగా ప్రతి మునిసిలిటీకి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తారు. 1992లో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌తోనే ఇప్పటికీ కొవ్వూరు మునిసిపాలిటీ పనిచేస్తోంది. ఆయా పట్టణాల అభివృద్ధిని పరిగణనలోకి తీసుకుని మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తుంటారు. ముప్పై ఏళ్ల తర్వాత ఈ మునిసిపాలిటీలో మాస్టర్ ప్లాన్ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఏపీ మెట్రోపాలిటన్ రీజియన్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్- 2016లోని సెక్షన్ 12, సబ్ సెక్షన్ (1), రూల్ -2018 లోని రూలు 16, సబ్ రూలు (1) కింద రాజమహేంద్రవరం పట్టణాభివృద్ధి సంస్థ (రుడా) పరిధిలోని కొవ్వూరు మునిసిపాలిటీకి డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రజల అభ్యంతరాలు, సలహాలు తెలుసుకునేందుకు ఈనెల 23 నుంచి ఏప్రిల్ 21 వరకూ 30 రోజులు గడువు ఇచ్చారు. ఈ మేరకు ప్రజాసౌకర్యార్థం ఆర్డీవో, తహసీల్దార్, మునిసిపల్ కార్యాలయాలతో పాటు రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ఈ డ్రాఫ్ట ప్రతులను ఉంచారు. ప్రస్తుతం కొవ్వూరు పట్టణ విస్తీర్ణం 17.98 చదరపు కిలోమీటర్లు. ప్రతిపాదిత 8 పంచాయతీలు మునిసిపాలిటీలో విలీనమైతే ఆ విస్తీర్ణం రెట్టింపవుతుంది. పట్టణానికి ఐదు కిలోమీటర్ల పరిధిలోని పంచాయతీలను విలీనం చేయాలన్న ప్రతిపాదన గతంలోనే వచ్చింది. అప్పట్లో ఆయా పంచాయతీల పాలకవర్గాల నుంచి సానుకూలత వ్యక్తం కాలేదు. దీంతో ఆ ప్రతిపాదన మరుగున పడింది. ఇప్పుడు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌పై ఆయా పంచాయతీలు, అక్కడి నాయకులు ఏవిధంగా స్పందిస్తారనేది వేచి చూడాలి.

పంచాయతీల విలీనానికి ప్రతిపాదన

కొవ్వూరు మునిసిపాలిటీలో ప్రస్తుత జనాభా 39,706. పట్టణాన్ని ఆనుకుని ఉన్న 8 పంచాయతీలను విలీనం చేయాలని ప్రతిపాదించారు. ఆరికిరేవుల, చాగల్లు, దొమ్మేరు, నందమూరు, పశివేదల, తోగుమ్మి, వాడపల్లి, వేములూరులతో పాటు కొవ్వూరును కలిపి మునిసిపాలిటీగా ప్రతిపాదించారు. ప్రస్తుతం థర్డ్ గ్రేడ్ మునిసిపాలిటీ కొవ్వూరు. మాస్టర్ ప్లాన్ అమల్లోకి వస్తే 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాభా 1.06 లక్షలకు పెరుగుతుంది. అప్పుడు కొవ్వూరుకు సెకండ్ గ్రేడ్ మునిసిపాలిటీ హోదా దక్కుతుంది.

మారనున్న రోడ్ల స్వరూపం

డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ ప్రతిపాదన అమలులోకి వస్తే పట్టణాన్ని కలుతున్న, పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ సువిశాలంగా మారతాయి. ప్రధానంగా మెరక వీధి వాటర్ ట్యాంకు నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ గల రోడ్డు 60 అడుగులకు, బస్టాండ్ సెంటర్ నుంచి విజయవిహార్ సెంటర్ వరకూ గల రోడ్డుకు 40 అడుగులకు వెడల్పు చేస్తారు. అంగన్‌పాల్ వారి వీధిని హోలీ ఏంజెల్స్ స్కూల్ పక్క నుంచి 60 అడుగుల వెడల్పుతో నేరుగా నందమూరు రోడ్డుకు కలిపేలా రోడ్డును ప్రతిపాదించారు. ఇకబబస్టాండ్ నుంచి నందమూరు శివార్లలోని జంక్షన్ వరకూ గల రహదారిని 60 అడుగుల రోడ్డుగాను, గామన్ బ్రిడ్జి నుంచి గోదావరి మాత విగ్రహం వరకూ ఉన్న మార్గాన్ని వంద అడుగుల రోడ్డుగాను, మినీ బైపాస్ రోడ్డు పెట్రోల్ బంక్ వద్ద నుంచి సర్ ఆర్థర్ కాటన్ విగ్రహం వరకూ గల రహదారిని 60 అడుగుల రోడ్డుగా ప్రతిపాదించారు. ఆరికిరేవుల నుంచి వాడపల్లి వరకూ గల ఏటిగట్టు రోడ్డును 100 అడుగుల రోడ్డు గాను, అవంతీ ఫీడ్స్ ఫ్యాక్టరీ నుంచి ఏటిగట్టును కలిపే రోడ్డును 80 అడుగుల రోడ్డుగాను, కొవ్వూరు రైల్వే స్టేషన్ నుంచి వేములూరు, తోగుమ్మి మీదుగా వాడపల్లి వరకూ ప్రస్తుతం ఉన్న రహదారిని 80 అడుగుల రోడ్డుగాను విస్తరిస్తారు. నందమూరు జంక్షన్ నుంచి పశివేదల వరకూ 80 అడుగుల రోడ్డుకు ప్రతిపాదించారు.

భవిష్యత్తు అవసరాలకు ప్రతిపాదనలు ఇలా..

మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన మొత్తం 36.63 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నివాస ప్రాంతాలకు 45.93 శాతం అంటే 1682.36 హెక్టార్లు, వ్యవసాయ అవసరాలకు 31.55 శాతం అంటే 1155.58 హెక్టార్లు, వాణిజ్య, మిక్స్‌డ్ అవసరాలకు 78.10 హెక్టార్లు, ప్రమాదకరమైన కర్మాగారాలు, కాలుష్య పూరిత పరిశ్రమలకు వరుసగా 32.29, 12.79 హెక్టార్ల చొప్పున భూమిని కేటాయించారు. వర్క్ సెంటర్ జోన్లకు 57.28 హెక్టార్లు, స్కూళ్లు, ఆసుపత్రులు, దేవాలయాలు వంటి పబ్లిక్, సెమీ పబ్లిక్ అవసరాలకు 53.87 హెక్టార్లు,బ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్ల వంటి ప్రజావసరాలకు 24.95 హెక్టార్లు, ఆట స్థలాలు, రిక్రియేషన్లు, పార్కుల వంటి వాటికి 52.91 హెక్టార్లు, రవాణాకు 431.27 హెక్టార్లు అంటే మొత్తం విస్తీర్ణంలో 11.77 శాతం భూమిని కేటాయిస్తూ ప్రతిపాదించారు.

అభ్యంతరాలుంటే తెలియజేయవచ్చు



ఈ డ్రాఫ్ట మాస్టర్ ప్లాన్‌పై ప్రజలకు ఏమైనా అభ్యంతరాలు ఉంటె తెలియజేసేందుకు 30 రోజుల గడువు ఇచ్చాం. ఏప్రిల్ 21లోగా కార్యాలయపు పనివేళల్లో రుడా ఉపాధ్యక్షుడు, రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు గానీ, కొవ్వూరు మునిసిపల్ కమిషనర్‌కు గానీ రాతపూర్వకం గానీ, ఈ-మెయిల్ ద్వారా గానీ అభ్యంతరాలు, సూచనలు తెలియజేయవచ్చు. వివరాలు హెచ్‌టీటీడీ //ఆర్‌యుడీఏ.ఏపీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

– ఎ. శ్రీధర్, టౌన్ ప్లానింగ్ అధికారి, కొవ్వూరు మునిసిపాలిటీ

మహిళలంతా ఆర్థికంగా ఎదగాలి

- జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత


కాలాబత్తుల సుజాత

నిడదవోలు రూరల్: డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడతల వారీగా రుణమాఫీ మొత్తాన్ని చెల్లిస్తున్నారని, ఆ సొమ్ములను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత అన్నారు. నిడదవోలులోని మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 25న ఏలూరు జిల్లా దెందులూరులో సీఎం జగన్ చేతుల మీదుగా మూడో విడత సొమ్ములను డ్వాక్రా ఖాతాలకు జమ చేస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా 27,413 డ్వాక్రా సంఘాలకు రూ.242.85 కోట్లు రుణమాఫీ జరుగుతుందని చెప్పారు.

పోషకాహారంతో ఆరోగ్యం


పోషణ్ పక్వాడాలో పాల్గొన్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

నల్లజర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని పోతవరం పీహెచ్‌సీ డాక్టర్ రాజశేఖర్ సూచించారు. పోతవరంలోని నంబర్ 48 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏడో నెల నుంచి రెండేళ్ల పిల్లలకు అందించే పోషకాహాన్ని పిల్లలకు తినిపించాలన్నారు. కిశోర బాలికలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. కార్యకర్త అరుణకుమారి, ఆయా మంగ, హెల్త్ వర్కర్ బీవి ఆనంద్, ఏఎన్ఎం దుర్గాదేవి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారికి మెమోలు

- డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామ్‌గోపాల్
- పెరవలిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక


సామాజిక తనిఖీ ప్రజావేదికలో డ్వామా పీడీకి ఉపాధి పనుల గురించి వివరిస్తున్న సిబ్బంది

పెరవలి: ఉపాధి హామీ పథకం కింద 2021-22 సంవత్సరంలో మండలంలో రూ.2.85 కోట్ల వ్యయంతో 397 పనులు పూర్తి చేశారని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామ్‌గోపాల్ పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంపై మండలస్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదికను శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిబంధనలు వ్యతిరేకంగా ఎక్కువ మంది ఉపాధి కూలీలు పనిచేసినట్టుగా మస్టర్లలో పేర్కొన్న ఫీల్డ్ అసిస్టెంట్లకు మెమోలు ఇచ్చామన్నారు. మొక్కలు నాటిన స్థలాల్లో అవి లేనందున కొత్త మొక్కలు నాటాలని సంబంధిత ఉపాధి సిబ్బందిని ఆదేశించామన్నారు. 2021-22లో కాలువలు, బోదెలు, మట్టి తవ్వకం వంటి 359 పనులు చేపట్టి రూ.1.25 కోట్లు ఖర్చు చేశారన్నారు. అలాగే 38 ఇళ్ల స్థలాల మెరక పనులకు రూ.1.60 ఖర్చు చేశారని వివరించారు.

ఉపాధి నిధులు సద్వినియోగం చేసుకోండి

ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకుంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామ్‌గోపాల్ అన్నారు. ప్రభుత్వం నిబంధనలను సడలించాక మరిన్ని పనులను ఉపాధిహామీ పథకంలో చేసుకోవడానికి ఆస్కారం ఏర్పడిందన్నారు. పనుల్లో అవకతవకలు జరిగినట్టు రుజువైతే బాధ్యులపై చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీడీఓ రమేష్, ఉపాధి ఏపీడీ మాలతీ, సీసీ ప్రకాష్, హెచ్ఆర్ నరేష్ వివిధ శాఖల ఏఈలు, ఎస్ఆర్పీలు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, డ్వాక్రా సీఏలు, పాల్గొన్నారు.

29న సామాజిక తనిఖీ ప్రజావేదిక

నిడదవోలు రూరల్: మండలంలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధిహామీ పనులపై ఈ నెల 29న సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తారని ఎంపీడీఓ టి.మూర్తిబాబు శుక్రవారం తెలిపారు. సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీరాజ్, అటవీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

చాగల్లు: ఈనెల 25 నుంచి వచ్చే నెల 24 వరకూ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని మండల పశువైద్యాధికారి యు.ముఖేష్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 12 వేల పశువులకు టీకాల వేస్తామన్నారు.గాలికుంటు వ్యాధి సోకకుండా తప్పనిసరిగా పశువులకు ఈ ఉచిత వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. నాలుగు నెలలు దాటిన పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. చూడి పశువులకు కూడా టీకాలు వేయవచ్చని, నిండు చూడి పశువులకు మాత్రం వేయకూడదని తెలిపారు.

మద్యం దుకాణం తొలగించాలంటూ నిరసన

నిడదవోలు రూరల్: జన సంచారం కలిగిన ప్రదేశాల్లో ఎక్సైజ్ శాఖ ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని పట్టణ ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. నిడదవోలు బస్టాండ్ సెంటర్లో హాస్పిటల్స్ ఉన్న ప్రాంతాల్లో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. రాంబాబు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలకు అనుమతులు ఇచ్చిన ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక యువకులు లెనిన్, నాని, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాసవీ వనిత క్లబ్ సేవా కార్యక్రమాలు

నిడదవోలు రూరల్: వాసవీ క్లబ్ రీజియన్ చైర్మన్ మానేపల్లి వెంకటరమణ పర్యటన నేపథ్యంలో నిడదవోలు పట్టణంలో వాసవీ వనిత క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎల్‌బీహెచ్ స్కూల్లో 100 విద్యార్థులకు రాగి జావ తాగడానికి గ్లాసులు పంపిణీ చేశారు. వేణుగోపాలస్వామి ఆలయంలో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. అలాగే గొడుగులు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దివ్వెల ఫణిమాధురి, గొల్లపూడి గాయత్రి, కోశాధికారి జవ్వాది శిరీష, సభ్యులు కేదారిశెట్టి సునీత, జయవరపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర పఠనమే విజయానికి మూలం

- మాజీమంత్రి శ్రీరంగనాథరాజు
- తెలికిచెర్ల ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అంతరిక్ష నక్షత్రశాల ప్రారంభం


కార్యక్రమంలో మాజీమంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తదితరులు

నల్లజర్ల: విశ్లేషణ, సృజనాత్మకత, ఆలోచనా శక్తి, నిరంతర పఠనం ద్వారా విజయాలు సాధించవచ్చని ఆచంట ఎమ్మెల్యే, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని తెలికిచెర్ల శివార్లలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథరాజు అంతరిక్ష నక్షత్రశాలను ఆ స్కూల్లో ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూల్ చైర్మన్ చెరుకువాడ నరసింహరాజు (నరేష్) స్కూలు నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గ్రంధి సాయిబాబా వరప్రసాద్, జీఎస్‌వీ మణికుమార్, ప్రిన్సిపాల్ శ్రీకల్పనా సింగ్, అధ్యాప కబృందం పాల్గొన్నారు.

ఘనంగా పుంత ముసలమ్మ వారి జాతర


వెలగదుర్రులోని పుంత ముసలమ్మ

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుర్రులో కొలువైన పుంత ముసలమ్మ జాతర మహోత్సవాలు ఐదు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ముదునూరి వరదరాజు, ఇందుకూరి సుబ్బరాజు, పేరిచర్ల రంగరాజు, నండూరి వరప్రసాద్, ఎస్.సూరిబాబు, ఉర్రింకల రామన్న భక్తుల కోసం ఏర్పాట్లను పరిశీలించారు.

ఊనగట్లలో..

చాగల్లు: ఊనగట్లలోని పుంతలో ముసలమ్మ అనే కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గురువారం రాత్రి తాడేపల్లిగూడెంకు చెందిన కళాకారిణి చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఉత్సవాల సందర్భంగా విద్యుద్దీపాలతో ఆలయ ప్రాంగణం శోభాయమానంగా వెలుగొందుతోంది. ఈ నెల 28న అన్న సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

క్షయను నిర్మూలిద్దామంటూ ప్రతిజ్ఞ


నల్లజర్ల పీహెచ్‌సీ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

నల్లజర్ల: డబ్ల్యూహెచ్ఓ ఇచ్చిన నినాదంతో క్షయ వ్యాధి నివారణకు తాము కలసి పనిచేస్తామంటూ నల్లజర్ల పీహెచ్‌సీ సిబ్బందితో ఆపీహెచ్‌సీ ఎదుట సీహెచ్ఓ చంద్రశేఖరరాజు ప్రతిజ్ఞ చేయించారు. క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం వారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ పీహెచ్‌సీ డాక్టరు తెల్లం గంగాధరరావు మాట్లాడుతూ 2025 నాటికి దేశాన్ని క్షయ రహితంగా మార్చాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కార్యక్రమాలను రూపొందిందన్నారు. డాక్టరు సిరాజుద్దీన్ వైద్య సిబ్బంది, ఆశ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కొవ్వూరు: దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి సూరవరపు ధర్మరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఆ పీహెచ్‌సీలో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశం అనంతరంగ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి: క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా దేవరపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కడిమి వీరకుమారి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీపీ దుర్గారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ డి.సాంబశివరావు, ఉప సర్పంచ్ వెలగా సాంబశివరావు, కడిమి రాజు, పంచాయతీ కార్యదర్శి ఎస్. రవికిషోర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసిస్ట్‌కు ఉత్తమ సేవా పురస్కారం


రాజమహేంద్రవరంలో ఉత్తమ సేవా పురస్కారాలు అందుకుంటున్న ఆశాజ్యోతి, శ్రీనివాస్

తాళ్లపూడి: శుక్రవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా తాళ్లపూడి పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్న పి.శ్రీనివాస్‌కు ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో కె.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా శ్రీనివాస్ ప్రశంసాపత్రాన్ని స్వీకరించారు. టీబీ ఫార్మసీ విభాగంలో జిల్లా స్థాయిలో శ్రీనివాస్‌కు ఈ పురస్కారం దక్కింది. ఆయనను తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది అభినందించారు.

టీబీ సూపర్‌వైజర్ ఆశాజ్యోతికి..

పెరవలి: కానూరు పీహెచ్‌లో క్షయ నివారణ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వి.ఆశాజ్యోతికి ఉత్తమ సేవా అవార్డు వరించింది. రాజమహేంద్రవరంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా క్షయ నివారణ అధికారి ఎస్.వసుంధర చేతుల మీదుగా ఆశాజ్యోతి ఈ అవార్డు అందుకున్నారు.